క్లుప్తంగా

ఘనంగా గొల్లాలమ్మ జాతర



అముజూరులో కొలువైన గొల్లాలమ్మ

కె.గంగవరం: మండలంలోని అముజూరు గ్రామ దేవత గొల్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని శనివారం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా బుట్టబొమ్మలు, కోయడాన్సులు, గరగనృత్యాలు, బ్యాండ్‌మేళాలు, భారీ బాణసంచాతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారితో పాటు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సంప్రదాయం ప్రకారం గ్రామంలోని రెండు చోట్ల తాడిచెట్లను నరికి ఆలయం వద్ద చెట్లతో ఉయ్యాల ఏర్పాటు చేసి అమ్మవారికి సేవ నిర్వహించారు. జాతరం అనంతరం ఆలయం వద్ద ఆదివారం తీర్థం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు తపాలా ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): గ్రామీణ తపాలా ఉద్యోగులు రాష్ట్ర స్థాయి సర్కిల్ వర్కింగ్ కమిటీ నాయకులు, డివిజనల్, బ్రాంచి కార్యదర్శులు సమావేశం ఆదివారం మండపేటలో నిర్వహించనున్నట్టు కార్యక్రమ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎస్‌వీవీ మునేశ్వరరావు శనివారం తెలిపారు. మండపేట పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న సూర్య గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, రాష్ట్రం నలుమూలల నుంచి తపాలా శాఖ ఉద్యోగులు హాజరవుతారని మునేశ్వరరావు తెలిపారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

కపిలేశ్వరపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి శనివారం తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 వరకూ విజ్ఞానదాయక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సామాజిక అంశాలను ప్రతిబింబించే కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, సంగీతంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని శివకుమారి తెలిపారు.

ఆలయ వార్షికోత్సవ పూజలు



టేకిలో వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

కపిలేశ్వరపురం: టేకిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతొన్నాయి. ఈనెల 21న ప్రారంభమైన స్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. శుక్రవారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించగా గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు హాజరయ్యారు. పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు, ప్రసన్నకుమార్, భార్గవ్ బ్రహ్మత్వంలో ఉత్సవ పూజలు చేశారు. దేవతామూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. వార్షికోత్సవ పూజలు రేపటితో ముగియనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



మండపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో శనివారం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం తాలూకు చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొని ఆర్థిక సాయానికై దరఖాస్తు చేసుకొన్న 19 మందికి సీఎంఆర్‌ఎఫ్ ఆర్థికసాయం మంజూరైంది. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నుంచి 19 మందికి రూ.13,86,093 సాయమం మంజూరైందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కాశిన కాశీ విశ్వనాథం, వైఆర్‌కె పరమహంస, పుత్సల శ్రీనివాస్, దేవు శ్రీను పాల్గొన్నారు.

పదిలో మెరిసిన పల్లె విద్యార్థులు

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అభివృద్ధికి ప్రతిబింబంగా ఫలితాలు
- పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్దిన అప్పటి ప్రభుత్వం
- ప్రభుత్వ పాఠశాలలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- తల్లికి వందనం హామీకే పరిమితం
- ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషితో మెరుగైన ఫలితాలు



అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం: పదో తరగతి పరీక్షలనగానే విద్యార్థుల్లో ఓ మధురానుభూతి. ఉన్నత చదువుకు వెళ్లేందుకు గొప్ప మెట్టు. విద్యార్థి ఫలితాల్లో మెరవాలంటే ప్రభుత్వమూ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మొత్తం సమాజం సహకరించి తీరాలి. అదే చేసింది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఓ వైపు ప్రభుత్వ పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్దింది. మెరుగైన సదుపాయాలను కల్పించింది. ఉపాధ్యాయులకు క్రమం తప్పకుండా దిశా నిర్దేశం చేసింది. విద్యార్థులకు సకాలంలో విద్యా ఉపకరణాలను అందించింది. తల్లిదండ్రులకు ఆర్థికసాయంగా అమ్మఒడి పేరుతో ఆర్థికసాయం అందించింది. ఐదేళ్ల పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు నేటి విద్యా సంవత్సరం ఫలితాలను ప్రతిబింబించాయి.

రెండు నియోజకవరాల్లో ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులిలా..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 94 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలయాలకు చెందిన 5,084 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాశారు. రామచంద్రపురం మండలంలో 32, కె.గంగవరం మండలంలో 10, మండపేట మండలంలో 28, కపిలేశ్వరపురం మండలంలో 11, రాయవరం మండలంలో 13 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

మండపేట నియోజకవర్గంలో గత విద్యా సంవత్సరాల్లో ఫలితాలిలా...

2022-23 విద్యా సంవత్సరం ఫలితాల్లో మండపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,130 మంది పరీక్షలు రాయగా వారిలో 1,510 మంది ఉత్తీర్ణులు కావడంతో 71 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2023-24లో 2,095 మందికి 1,806 మంది ఉత్తీర్ణులు కావడంతో 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండపేట మండలం ప్రభుత్వ పాఠశాలల నుంచి 2022-23లో 1,015 మంది పరీక్షలు రాయగా 673 మంది ఉత్తీర్ణులై 67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2023-24లో 1,008 మంది పరీక్షలు రాయగా 817 మంది ఉత్తీర్ణులయ్యారు దీంతో 81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాయవరం మండలంలో 2022-23లో 642 మందికి 462 మంది ఉత్తీర్ణులై 71 శాతం నమోదైంది. 2023-24లో 700 మంది పరీక్షలు రాయగా 614 మంది ఉత్తీర్ణులవ్వడంతో 88 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కపిలేశ్వరపురం మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 2022-23లో 473 మంది విద్యార్థులు హాజరు కాగా 349 మంది ఉత్తీర్ణులై 74 ఉత్తీర్ణతాశాతం లభించగా 2023-24లో 387 మందికి 375 మంది ఉత్తీర్ణత సాధించడంతో 97 శాతానికి ఉత్తీర్ణతా శాతం పెరిగింది.

రామచంద్రపురం నియోజకవర్గంలో గత సంవత్సరాల్లో ఉత్తీర్ణత ఇలా....

రామచంద్రపురం పట్టణంలోని 7 పాఠశాలలకు గానూ 2022-23లో 400 మంది పరీక్షలు రాయగా 228 మంది ఉత్తీర్ణులవ్వడంతో 57 శాతం నమోదైంది. 2023-24లో 391 కి 314 ఉత్తీర్ణులయి 81 శాతం నమోదైంది. రామచంద్రపురం రూరల్ మండలంలోని ఎనిమిది పాఠశాలలకు గానూ 2022-23లో 502 మందికి 248 ఉత్తీర్ణులుకావడంతో 50 శాతం నమోదుకాగా 2023-24లో 533 కి 450 మంది ఉత్తీర్ణులయి 85 శాతం నమోదైంది. కాజులూరు మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలల నుంచి 2022-23లో 605 మందికి 431 మంది ఉత్తీర్ణులయి 72 శాతం నమోదుకాగా 2023-24లో 95 శాతం నమోదైంది. కె.గంవరం మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 2022-23లో 62 శాతం ఉత్తీర్ణత శాతం నమోదుకాగా 2023-24లో 450 మందికి 418మంది ఉత్తీర్ణులై 93 శాతం నమోదైంది.

మెరిసిన విద్యార్థులు..

అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పేరాబత్తుల ప్రసన్న 576, అరవపల్లి ఈశ్వరి 571, కర్రి జాహ్నవి 563 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. రాయవరం మండలం మాచరవరం జెడ్పీ ఉన్నత పాఠాల విద్యార్థిని పసుపులేటి వెంకటలక్ష్మీరమ్య 589 మార్కులు సాధించింది. వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బోణం వెంకట భాస్కర శ్రీరామ్ 588 మార్కులు సాధించాడు. రామచంద్రపురం పట్టణంలోని పిల్లావారి ఉన్నతపాఠశాల విద్యార్థిని వెలగల లలితా అభినవ చంద్రహాస 589 మార్కులు, ఎ.సావరం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.శ్రీలక్ష్మి 582 మార్కులు సాధించారు. ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పలివెల స్వాతి 582 మార్కులు, హసన్‌బాద జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పీవీవీఎస్ఎస్ఎస్ సంజన 572 మార్కులు శ్రీ మహాత్మా జ్యోతీరావ్‌పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థిని కొరుప్రోలు రమ్య 573 మార్కులు సాధించారు. కాజులూరు మండలం తణుకువాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వాసంశెట్టి చరణ్‌దీప్తి 585, కాజులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వాసిరెడ్డి రామలక్ష్మి 582మార్కులు సాధించారు.

గత ప్రభుత్వ అభివృద్ధితో ఈ ఏడాది ఫలితాలిలా...

2024-25 విద్యా సంవత్సరం దాదాపు కూటమి పాలనలో సాగింది. విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికివందనం పేరుతో రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా సాయమందించలేదు. పాఠశాలలను అభివృద్ధి చేసిందీ లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలను మెరుగుపర్చింది. తరగతి గదులను అధునాతనంగా తీర్చిదిద్దింది. ఉపాధ్యాయుల్లోనూ, విద్యార్థుల్లోనూ మనోధైర్యాన్ని నింపింది. ఆ కృషి ప్రభావంతో పాటు విద్యార్థి ఉపాధ్యాయుల శ్రమ ప్రస్తుత ఫలితాలను ప్రతిబింబించింది. మండపేట మండలంలో ఈ ఏడాది 1,769 మంది పరీక్ష రాయగా 1,583 ఉత్తీర్ణులై 89.48 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాయవరం మండలంలో 686 కి 607 మంది ఉత్తీర్ణులై 88.48 శాతం, కపిలేశ్వరపురం మండలంలో 470 మందికి 447 మంది ఉత్తీర్ణులై 95.01 శాతం నమోదైంది. రామచంద్రపురం మండలంలో 81.63 శాతం, కాజులూరు మండలంలో 84 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

విద్యార్థులకు ప్రజాప్రతినిధుల అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న చైర్‌పర్సన్ నూకదుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మెరుగైన మార్కులతో ప్రతిభ కనబర్చిన పట్టణంలోని గౌతమి మున్సిపల్ పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అభినందించారు. 600 మార్కులకు గానూ 576 మార్కులు సాధించిన సలా దీక్షిత, 549 మార్కులు సాధించిన నీలం వైష్ణవి, 545 మార్కులతో వాసా సిరిలక్ష్మిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, పాఠశాల హెచ్ఎం వల్లూరి సూర్యలత, ఉపాధ్యాయిని కె.దుర్గాదేవిలు ఎమ్మెల్యే వేగుళ్ళ, చైర్‌పర్సన్ నూక దుర్గారాణిలను విడివిడిగా వారి వారి కార్యాలయాల్లో కలిశారు. వారిని ప్రజాప్రతినిధులిద్దరూ ఆశీర్వదించి ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నాయుడు చంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు పాఠశాలలో నిరుపేదవర్గాలకు చెందిన విద్యార్థులు ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఎ.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి మండలంలోని 10 ప్రైవేటు పాఠశాలలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు అన్ని వివరాలతో తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు ఈ నెల 28 నుంచి మే 15 వరకు లాటరీ ద్వారా మే 16 నుంచి విద్యార్థులకు పాఠశాలలను కేటాయిస్తారని సూచించారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

కాజులూరు: ప్రతి మహిళా ఒక పారిశ్రామికవేత్తగా ఎదిగి తమ కుటుంబ, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెంలో మహిళా స్వయం ఉపాధి పథకంలో భాగంగా మహిళలకు కుట్టుమెషీన్ల శిక్షణా కార్యక్రమాన్ని మంత్రి సుభాష్ తండ్రి సత్యం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం ఉచిత కుట్టుమెషీన్ల శిక్షణ చేపట్టిందరన్నారు. మూడు నెలల పాటు శిక్షణ తీసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టుమెషీన్లు ఇచ్చి వారికి పని కల్పిస్తూ ఆర్డర్లు ఇప్పించేందుకు జిల్లా వ్యాప్తంగా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ, డాక్టర్ చుండ్రు వీర్రాజుచౌదరి, దేగల సతీష్, అంగర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరావు తన క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలో పేర్కొన్న అంశాలు ఆధారంగా సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించారు. సాంకేతిక ఇబ్బందులున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వేగుళ్ళ తెలిపారు.

ప్రజా సమస్యలపై ఉద్యమం

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ రానున్న రోజుల్లో ఉద్యమించనున్నట్టు పార్టీ అనుబంధ ఏపీ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు శనివారం తెలిపారు. విజయవాడలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొనగా తీర్మానాలను వెల్లడించారు. సమావేశంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల దృష్టికి నియోజకవర్గ సమస్యలను తీసుకెళ్లినట్టు కామన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: ద్వారపూడి, యానం రహదారిలో కాజులూరు మండలం కుయ్యేరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. యానంకు చెందిన పంతాడి బాలకృష్ణ తన బైక్‌పై ద్రాక్షారామ వెళుతున్నాడు. కుయ్యేరు వద్దకు వచ్చేసరికి రోడ్డుపై మద్యం తాగి నడచి వెళ్లుతున్న ఓ వ్యక్తి అడ్డుగా రావటంతో షడన్‌బ్రేక్ వేశాడు. బైక్ పల్టీలు కొట్టడంతో బాలకృష్ణ గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి గాయాల పాలైన అతడిని యానం ఆసుపత్రికి తరలించారు.

సత్తిబాబు కుటుంబానికి బీసీ నేతల పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం కేపీ రోడ్డులో ఈ నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాదాబత్తుల సత్తిబాబు కుటుంబ సభ్యులను శనివారం బీసీ సంఘం నాయకులు పరామర్శించారు. మల్లువలస గణపతిరావు, కోనా సత్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, వీరమల్ల శ్రీనివాస్, పెంకే గంగాధరరావు, గోరు అన్నవరం చుక్కల అప్పారావు, ఒంపోలు పోలరాజు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సత్తిబాబు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాదాబత్తుల సత్తిబాబు కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ప్రభుత్వం నుంచి కుటుంబాన్ని ఆదుకొనేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు తొలగింపు



పూడ్చుతున్న దశలో ఏడిదలోని చెరువు

కపిలేశ్వరపురం (మండపేట): సొంత ఇల్లు సమకూర్చుకోలేని నిరుపేదలకు ప్రభుత్వ స్థలాలే దిక్కు. గతంలో పరిస్థితులు అనుకూలించిన వారంతా చెరువుగట్టునో, రహదారుల పక్కనో వారి స్తోమతకు తగ్గట్టు నివాసాలను ఏర్పాటు చేసుకొన్నారు. సుదీర్ఘకాలం పాటు నివాసముంటూ జీవనం గడుపుతున్నారు. మండపేట రూరల్ మండలం ఏడిద గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని చెరువుగట్టుపై 36 కుటుంబాలు సుమారు 40 ఏళ్లుగా స్థిరనివాసం ఉంటున్నారు. వారిని ఖాళీ చేయించి నివాసాలను తొలగించారు. ప్రత్యామ్నాయాలు చూపకుండా చెరువుల పరిరక్షణ చట్టాలు, సుప్రీంకోర్టు తీర్పులను ఆసరాగా తీసుకొని పేదలకు అన్యాయం చేయడం ఏపాటిదంటూ గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు వాసిరెడ్డి అర్జున్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఒక చెరువు గట్టుపై నివాసితులను ఖాళీ చేయించడమే కాకుండా సమీపంలో మరో చెరువును పూడ్చే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు.

నిర్లక్ష్య డ్రైవింగ్, అజాగ్రత్తలతోనే రహదారి ప్రమాదాలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్

రాయవరం: రహదారి ప్రమాదాల్లో అత్యధికంగా నిర్లక్ష్య డ్రైవింగ్, అజాగ్రత్తలతోనే జరుగుతున్నాయని రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ సూచించారు. మండలంలోని మాచవరం సెంటర్ వద్ద శనివారం డీఎస్పీ రఘువీర్ మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్సై డి.సురేష్‌బాబులతో కలసి వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారులు, ఆటో డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం, కాలపరిమితి ముగిసిన వాహనాలు వినియోగించడం, అధిక వేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారి ప్రమాదాల్లో చనిపోయిన వారు వారి కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగులుస్తున్నారన్నారు. పలు రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ యజమానులు మృతి చెందడం వలన కుటుంబాలు నిరాశ్రయులవుతున్నాయని, ప్రతి వాహనదారుడు కుటుంబం గురించి ఆలోచన చేసి, హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వాహనదారులకు సూచించారు. 18 ఏళ్లు నిండని వారికి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, అలా ఎవరైనా ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. హెల్మెట్ లేని వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించి, హెల్మెట్ కొనుగోలు చేయించారు.

ఈ-శ్రమ్ కార్డుల అందజేత



రాయవరంలో ఈ-శ్రమ్ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్న నాయకులు

రాయవరం: అసంఘటిత రంగ కార్మికులుగా నమోదు చేయించుకున్న వారికి శనివారం ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో రెండు రోజులుగా కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమ్ పథకంలో నమోదు చేయిస్తున్నారు. ఈ విధంగా ఈ-శ్రమ్ కార్డులు పొందిన 150 మంది లబ్ధిదారులకు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు చేతుల మీదుగా ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాచుసాగుతో పర్యావరణానికి మేలు



నాచుసాగు యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు: చెరువు ఆధారిత సముద్రపు నాచు సాగు వల్ల పర్యావరణానికి, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కరవాక గ్రామంలో శనివారం సీవీడ్జ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఫారం పాంట్స్ ఫిష్ పాంట్స్ చెరువులను ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సాగు ద్వారా వచ్చే సముద్రపు నాచుకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఏర్పడుతుందన్నారు. వ్యవసాయానికి సేంద్రియ ఎరువులుగాను, పశువులకు గ్రాసంగాను, చేపటలకు, కోళ్లకు దాణాగాను, కాస్మొటిక్స్ రంగాలతో పర్యావరణ హితమైన ఉత్పత్తులను అందిస్తుందన్నారు. ప్రకృతి అందించే అద్భుత పంట అయిన సముద్రపు నాచు శక్తిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి హరిరామరాజు, ఉద్యాన అధికారి బీవీ రమణ, ఎమ్మార్వో సుబ్రహ్మణ్యంఆచార్యులు, ఎల్‌డీఎం కేశవవర్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు



తాడి వీరరాఘవరెడ్డి, ఎంఈఓ, రామచంద్రపురం

రామచంద్రపురం రూరల్: 2025-26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని ఎంఈఓ తాడి వీరరాఘవ రెడ్డి శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ మేరకు ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో తమ చిన్నారులను ఒకటో తరగతిలో చేర్పించడానికి ఈ నెల 28 నుంచి మే 15వ తేదీలోపుగా ఆన్‌లైన్‌లో సమీప గ్రామ/వార్డు సచివాలయం, మీసేవా కేంద్రం, ఇంటర్‌నెట్ సెంటర్లలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని నిరుపేద తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



వాసంశెట్టి నాగేశ్వరి, ఎంఈఓ, రామచంద్రపురం

రామచంద్రపురం రూరల్: ఈ నెల 28న సోమవారం ఉదయం రామచంద్రపురం మండలం పరిధిలోని 22 మంది, కె.గంగవరం మండలంలోని 20 మందికి మొత్తం 42 మంది దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా అందించనున్నట్లు ఎంఈఓ వాసంశెట్టి నాగేశ్వరి శనివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10 గంటలకు రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరుగనున్న ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి రామచంద్రపురం పట్టణం, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం మండలాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉపకరణాలు మంజూరు అయిన దివ్యాంగ చిన్నారులను తీసుకుని తల్లిదండ్రులు హాజరు కావలిసిందిగా ఆమె కోరారు.

పుంతలో ముసలమ్మకు మొక్కులు తీర్చుకున్న భక్తులు



అమ్మవారికి మొక్కులు తీర్చుకున్న భక్తులు

రాయవరం: రాయవరంలో కొలువైన పుంతలో ముసలమ్మ అమ్మవారికి శనివారం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న అమ్మవారి జాతర శుక్రవారం రాత్రి నిర్వహించగా, శనివారం అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. పాడి పంటలు, పసుపు కుంకుమలు, పిల్లాపాపలను చల్లగా చూడాలని కోరుతూ భక్తులు అమ్మవారికి సారె, చీర, నైవేద్యాలు సమర్పించుకున్నారు. రాయవరం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి తీర్థం సందర్భంగా ఆలయ కమిటీ భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసింది.

నేలటూరులో మాస శివరాత్రి పూజ



నేలటూరులో స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో శనివారం మాస శివరాత్రి పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక నీలాంబికా సమేత బసవేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. వడ్డాది గ్రామానికి చెందిన వీరా సదాశివరావు, సత్యవతి దంపతులు, వీరా చంద్రశేఖరరావు, లలితా మాధవి దంపతులు ఆర్థిక సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. భక్తులు ఓం నమశ్శివాయ నామాన్ని జపించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 21 ఏళ్ల నాలుగు నెలల నుంచి గ్రామంలో మాస శివరాత్రి పూజలను చేస్తున్నామన్నారు.

వేంకటేశ్వరుని ఆలయాలకు పోటెత్తిన భక్తులు



భక్తులతో పోటెత్తిన నల్లచెరువు వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసీ పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలను భక్తులు సందర్శించి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.